సాక్షి ఒడిశా

ఆదివారం । 26 । జనవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

శ్రీ మందిరం ఆదాయం శనివారం లెక్కించారు. నగదు రూ. 7,10,350 వచ్చినట్లు పేర్కొన్నారు.
- భువనేశ్వర్/పూరీ



ఘనంగా విజయ్ దివస్

మల్కన్‌గిరిలో బీఎస్ఎఫ్ జవాన్లు విజయ్ దివస్ నిర్వహించారు. జాతీయ జెండా ఎగురవేశారు.

- IIలో▸



విద్య అందరి కోసం

మల్కన్‌గిరిలో మారథాన్ జరిగింది. విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

- IIలో▸

న్యూస్‌రీల్

అనుమానాస్పదంగా ఏనుగు మృతి



మృతి చెందిన ఏనుగు

భువనేశ్వర్: అలొగొడా అటవీ శాఖ పరిధిలో ఏనుగు మృతి అనుమానాస్పదం అయింది. ఈ ప్రాంతంలోని నరసింగ్‌పూర్‌లో మృత ఏనుగుని గుర్తించారు. దీని వయస్సు 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. ఏనుగు కళేబరం పడి ఉన్న పరిసరాలు దృష్ట్యా విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఈ మేరకు విచారణ కొనసాగుతుందని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి, నలుగురికి గాయాలు

భువనేశ్వర్: నగర శివారులో శుక్రవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పొగమంచు ఎక్కువగా ఉండడంతో వేగంగా దూసుకొచ్చిన కారు చెట్టుని ఢీకొని అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొంది. ప్రమాద తీవ్రతతో విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. మృతుడు సునీల్ స్వంయిగా గుర్తించారు. గాయపడిన వారిలో రాజేష్ మహరణ, కాన్హు చరణ్ మల్లిక్, చందన్ మల్లిక్ మరియు సంగ్రామ్ రౌత్ ఉన్నారు. వీరంతా స్థానిక మంచేశ్వర్ ప్రాంతం మిక్చర్ కంపెనీలో పనిచేస్తున్న సిబ్బందిగా కనుగొన్నారు. భువనేశ్వర్, పూరీ జాతీయ రహదారి బైపాస్ సమీపం లింగిపూర్ దయానది వంతెనపై అర్ధరాత్రి 1.20 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. ధౌలి ప్రాంతంలో రాత్రి విందులో పాల్గొని తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. పూరీ నుంచి భువనేశ్వర్‌కు తిరిగి వస్తుండగా కారు రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తక్షణమే బాధితులకు సహాయక చర్యలు అందించారు. క్షతగాత్రులను సత్వర చికిత్స కోసం స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిలో చేర్పించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఉన్నత చికిత్స కోసం కటక్ ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రికి తరలించారు. ధౌలీ ఠాణా పోలీసులు కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వేడి కూర పడి విద్యార్థికి గాయాలు



కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సోహన్

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి మజ్జిగుడలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న సోహన్ మహానందియా అనే విద్యార్థిపై వేడి కూర పడి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం నాడు చోటు చేసు కున్న ఈ సంఘటనకు సంబంధించి గాయాలపాలైన సోహన్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రతి రోజు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న ఈ పాఠశాలలో శనివారం నాడు భోజనం పంపిణీ చేసే క్రమంలో విద్యార్థుల మధ్య తోపులాట జరిగి సోహన్ కిందపడిపోయాడు. అతడి మీద వేడి కూర పడింది. దీంతో గాయపడ్డాడు. వెంటనే అతడిని మజ్జిగుడ ఆరోగ్య కేంద్రానికి తరలించిన అనంతరం నిర్వాహకులు సోహన్ తల్లిదండ్రులు రాధాకృష్ణ మహానందియా, లలితా మహానందియాలకు సమాచారం అదించారు. అక్కడ ప్రాథమిక వైద్యాన్ని అందించిన డాక్టర్ అనుభవ్ సాహు మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించాలని విద్యార్థి తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు, నిర్వాహకులు సక్రమంగా ఉండకపోవడంతోనే ఇలాంటి సంఘటన జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఘనంగా.. ఓటర్ల దినోత్సవం



పర్లాకిమిడిలో జాతీయ ఓటరు దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, సబ్ కలెక్టర్, ఏడీఎం తదితరులు

పర్లాకిమిడి: ఒక్క ఓటుతో మన ఎంపీ, ఎమ్మెల్యేల జాతకాలు తారుమారు అవుతాయని 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. పట్టణంలో జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని మహారాజా ప్యాలస్ నుంచి కాలేజ్ జంక్షన్ వరకు వాకథాన్‌ను అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్ ప్రారంభించారు. అనంతరం రాజవీధిలో ఆర్చన్ బ్యాంకు గ్రౌండ్స్‌లో జరిగిన సాధారణ సమావేశంలో కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, డీఎఫ్ఓ ఎస్.ఆనంద్, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శతాధిక వృద్ధ ఓటర్లు నలుగుర్ని కలెక్టర్ దాస్ సత్కరించారు. అనంతరం ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోనని ప్రజలందరితో కలెక్టర్, ఎస్పీలు శపథం చేయించారు. అనంతరం నూతనంగా ఓటు హక్కు పొందిన యువతీ యువకులకు ఓటరు కార్డులను అందజేశారు. ఓటరు చైతన్యం, హక్కుపై నిర్వహించిన వివిధ పోటీలలో విజయం సాధించిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలను అధికారులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుచెస్మితా మఝి, బి.డి.ఓ.(గుసాని) గౌరచంద్ర పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో..

రాయగడ: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహోరా పచ్చ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. సమితి కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల మీదుగా బిజు ఆడిటోరియం వరకు కొనసాగింది. ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను కలెక్టర్ పట్వారి అందించారు.

జయపురంలో..

జయపురం: ఓటు ప్రజలకు రాజ్యాంగం కల్పిన ప్రాథమిక హక్కు అని జయపురం సబ్ కలెక్టర్, మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధకారిణి అక్కవరం శొశ్యా రెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక టౌన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగిస్తూ ఓటు ఒక ఆయుధమని తమకు నచ్చిన వ్యక్తిని ప్రజా ప్రతినిధిగా చట్టసభలకు ఎన్నుకునే సాధనమని తెలిపారు. ప్రలోభాలకు, డబ్బుకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పర్లాకిమిడిలో ఓటరు చైతన్యంపై వాకథాన్ ర్యాలీ



ఓటరు హక్కులపై మాట్లాడుతున్న కలెక్టర్ దాస్



శతాధిక వృద్ధ ఓటరుకు సత్కారం చేస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్



ఓటర్లతో శపథం చేయిస్తున్న కలెక్టర్ దాస్



జాతీయ ఓటరు దినోత్సవానికి హాజరైన అధికారులు, ప్రజలు



ర్యాలీని ప్రారంభిస్తున్న కుహోరా



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న పట్వారి, వేదికపై కల్యాణి, కుహోరా



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ తదితరులు



కార్యక్రమంలో నృత్యాలు చేస్తున్న కళాకారులు

రైతుల కాలనీలో అగ్ని ప్రమాదం

రాయగడ: స్థానిక రైతుల కాలనీ రెండో లైన్‌లో ఉంటున్న ఇప్పిలి అమన్న ఇంట్లో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్నవారు వెంటనే బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. విద్యుత్ తీగలు కాలిపోవడంతో పాటు సమీపంలో గల విలువైన వస్తువులు మంటలకు దగ్ధమయ్యాయి.



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

యువకుడి కిడ్నాప్ కేసులో ఆరుగురు అరెస్టు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మలో ఒక యువకుడిని కిడ్నాప్ చేసిన కేసులో ఆరుగురు నిందితులను బొరిగుమ్మ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక కారు, ఒక బొలేరో, రెండు బైక్‌లు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు బొరిగుమ్మ అడిషనల్ ఎస్పీ మనోజ్ కుమార్ పూజారి శనివారం విలేకరులకు తెలిపారు. అరెస్టయిన నిందితులు బొరిగుమ్మ ఖెండుగుడ గ్రామం జగదీష్ పాత్రో, రతన్ భూమియ, రామ హరిజన్, జగబందు హరిజన్, శాంతినగర్ వాసి పద్మణ పూజారి,జయంతిగిరి గ్రామానికి చెందిన చంద్రహరిజన్ అని వెల్లడించారు. గత శనివారం సాయంత్రం బొరిగుమ్మ సమితి ఖెండుగుడ గ్రామం వాసి డొంబు భూమియ తన గ్రామ సమీపంలో ఉన్న సమయంలో దుండగులు ఒక కారులో వచ్చి అతడిని ఎత్తుకుపోయిన విషయం విదితమే. వారు కారులో అతడిని ఎత్తుకుపోయి జయపురం తీసుకువెళ్లారని, అక్కడ బ్యాంక్‌లో గల డొంబు అకౌంట్ నుంయి రూ.35 వేలు డ్రా చేశారని పోలీసు అధికారి వెల్లడించారు. అనంతరం బొయిపరిగుడ సమితి రామగిరి, దండాబడి ప్రాంతాల నుంచి డొంబు భార్యకు వివిధ నంబర్ల ద్వారా ఫోన్ చేసి రూ.లక్ష డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. పోలీసులు దుండగుల మొబైల్ ఫోన్‌లను ట్రాప్ చేసి డొంబుకు రొణగుడ గ్రామ సమీపంలో రక్షించారు. ఎట్టకేలకు నిందితులను అరెస్టు చేశామని వెల్లడిస్తూ ఇంకా మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసు అధికారి పేర్కొన్నారు. సమావేశంలో బొరిగుమ్మ సబ్‌డివిజన్ పోలీసు అధికారి తపశ్వీణీ కుహోర్, బొరిగుమ్మ పోలీసు అధికారి యుగల్ కిశోర్ షా, ఎస్ఐ చరిత మడకామి ద్రోణాచార్యబాగ్ పాల్గొన్నారు.



పత్రికా ప్రతినిధుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారి తదితరులు

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాలు ప్రారంభంలో ఆచార్య డీఎస్‌రావు తదితరులు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో శనివారం నుంచి శ్రీవిద్యా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డీఎస్ రావు, పద్మావతి దంపతులు పూర్ణకుంభంతో ఉత్సవాలు ప్రారంభించగా, నరసన్నపేట ఆచార్యులు చామర్తి శ్రీనివాసచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు అరవెల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో మంగళ శాసనాలు, విశ్వక్సేరాధన, సాయంత్రం గరుడ వాహనంపై తిరువీధి ఉత్సవం జరిగాయి. మూడు రోజుల పాటు క్యాంపస్‌లో బ్రహ్మోత్సవాలు జరుగుతాయని అరవెల్లి శేఖరాచార్యులు తెలియజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.దుర్గాపాఢి, లక్ష్మీపతి రాజు (రాసూరు) తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన పలాస రకోరామేళం

ఆర్థిక ఆరోగ్య సూచీలో ఒడిశా నంబర్ వన్

భువనేశ్వర్: నీతి ఆయోగ్ వెల్లడించిన 2022–23 తొలి ఆర్థిక ఆరోగ్య సూచీ (ఎఫ్‌హెచ్ఐ) నివేదికలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచింది. అత్యధికంగా 67.8 పాయింట్లతో జాతీయ స్థాయిలో ఒడిశా అగ్రస్థానంలో నిలిచింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గోవా, జార్ఖండ్, గుజరాత్‌లు అచీవర్స్ గుర్తింపు సాధించాయి. మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, తెలంగాణ, మధ్య ప్రదేశ్, కర్ణాటకలు ముందంజ పోటీదారులుగా నీతి ఆయోగ్ నివేదిక పేర్కొంది. తమిళనాడు, రాజస్థాన్, బీహార్, హర్యానా నాలుగు రాష్ట్రాలు ప్రదర్శకులుగా గుర్తింపు సాధించగా దిగువన ఉన్న కేరళ, పశ్చిమ బెంగాల్, ఆంధ్ర ప్రదేశ్, పంజాబ్ 4 రాష్ట్రాలు ఆకాంక్షాత్మక వర్గంలో స్థానం సంపాదించాయి.

2022–23 ఆర్థిక సంవత్సరం ఆరోగ్య ఆర్థిక నివేదికలో 18 ప్రధాన రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకుని విశ్లేషించారు. 5 ప్రామాణికలతో ఈ సూచిక రూపొందించారు. నాణ్యమైన ఖర్చు, రాబడి సమీకరణ, ఆర్థిక విచక్షణ, రుణ సూచిక, రుణ స్థిరత్వం 5 ప్రామాణికలుగా పరిగణనలోకి తీసుకున్నారు. గనులు, ఖనిజ వనరులతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ ఆరోగ్యవంతమైన ఆర్థిక పట్టుని సాధించగలిగాయి. ఆదాయ సమీకరణ, ఆర్థిక విచక్షణతో పంజాబ్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ నీతీ ఆయోగ్ ఆరోగ్య ఆర్థిక రాష్ట్రాల జాబితాలో చోటు చేసుకున్నాయి.

నీతీ ఆయోగ్ ఆర్థిక ఆరోగ్యవంతమైన రాష్ట్రాల జాబితాలో అత్యధికంగా 67.8 పాయింట్ల స్కోరుతో ఒడిశా అగ్ర స్థానంలో నిలిచింది. రుణ సూచిక (99 పాయింట్లు), రుణ స్థిరత్వం (64 పాయింట్లు) ర్యాంకింగ్‌లతో వ్యయ నాణ్యత, ఆదాయ సమీకరణ కింద ఉత్తమ ఫలితాల్ని సాధించేందుకు దోహద పడినట్లు నివేదిక పేర్కొంది. రాష్ట్రం తక్కువ ఆర్థిక లోటు, చక్కని రుణ విధానం, సగటు కంటే ఎక్కువ మూలధన వ్యయాలు, జీఎస్‌డీపీ నిష్పత్తిని సాధించినట్లు నీతి ఆయోగ్ 2022–23 తొలి ఆర్థిక ఆరోగ్య సూచీ (ఎఫ్‌హెచ్ఐ) నివేదిక విశ్లేషించింది.

సేవలకు సత్కారం

- 29 మంది రాష్ట్ర పోలీసు సిబ్బందికి పతకాలు

భువనేశ్వర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అసాధారణ సేవ, ధైర్య సాహసాలకు గుర్తింపుగా 29 మంది రాష్ట్ర పోలీసు సిబ్బంది ప్రతిష్టాత్మకమైన శౌర్య మరియు సేవా పతకాలకు అర్హత సాధించారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ శనివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. దేశవ్యాప్తంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు – సివిల్ డిఫెన్స్ తదితర సేవలకు మొత్తం 942 మంది సిబ్బందికి శౌర్య పతకాలు, రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం(పీఎస్ఎం), మెరిటోరియస్ సేవా పతకం (ఎంఎస్ఎం) ప్రదానం చేయనున్నారు.



పోలీసు విభాగాల్లో అవార్డులకు ఎంపికైనవారు

పోలీసు శౌర్య పతకం (జీఎం)	
సిబ్బంది	హోదా
గిరీష్ చంద్ర మాఝీ	సబ్ ఇన్‌స్పెక్టర్
పబిత్ర కుమార్ సాహు	హవల్దార్
ఉమేష్ ముండా	హవల్దార్
పీతాంబర్ సత్నామి	కానిస్టేబుల్
కబిచంద్ర రౌత్	కానిస్టేబుల్
సుశాంత కుమార్ సాగర్	కానిస్టేబుల్
రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం	
సరోజ్ కుమార్ సామల్	పోలీసు సూపరింటెండెంట్
సత్యబాది మల్లిక్	కానిస్టేబుల్
మెరిటోరియస్ సేవా పతకం	
పరితోష్ మండల్	కానిస్టేబుల్
షేక్ అబ్దుల్ ఫయాజ్	సబ్ ఇన్‌స్పెక్టర్
మహ్మద్ తోఫిఫ్ రబానీ	కానిస్టేబుల్
శరత్ చంద్ర బెహెరా	సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్
త్రిలోచన్ బుధియా	కానిస్టేబుల్
తేజ్ బహదూర్ గురుంగ్	సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్
అతుల కుమార్ బిస్వాల్	హవల్దార్
జయంతి సునా	హవల్దార్
మనోజ కుమార్ జెనా	హవల్దార్
నరేష్ కుమార్ చౌదరి	కానిస్టేబుల్
దేబొ ప్రసాద్ మహంతి	హవల్దార్

అగ్నిమాపక సేవా విభాగంలో...	
రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం (పీఎస్ఎం)	
భమర్‌బర్ సేన్	లీడింగ్ ఫైర్‌మ్యాన్
మెరిటోరియస్ సేవా పతకం (ఎంఎస్ఎం)	
ప్రశాంత కుమార్ సాహు	లీడింగ్ ఫైర్‌మెన్
బిస్వ రంజన్ భోయ్	లీడింగ్ ఫైర్‌మెన్
అభిమన్యు ప్రధాన్	లీడింగ్ ఫైర్‌మెన్
నాగేంద్ర కుమార్ భల్	లీడింగ్ ఫైర్‌మెన్
హోంగార్డ్ – సివిల్ డిఫెన్స్ విభాగం	
రాష్ట్రపతి విశిష్ట సేవాపతకం (పీఎస్ఎం)	
ప్రమోద్ కుమార్ రౌత్	సివిల్ డిఫెన్స్ వాలంటీర్
సౌభాగ్య ప్రధాన్	హోంగార్డ్ కంపెనీ కమాండర్
మెరిటోరియస్ సేవా పతకం (ఎంఎస్ఎం)	
సంజీబ్ కుమార్ నాయక్	సివిల్ డిఫెన్స్ వాలంటీర్
దిద్దుబాటు సేవా విభాగం	
మెరిటోరియస్ సేవా పతకం (ఎంఎస్ఎం)	
కుంవార్ మరాండవి	సీనియర్ సూపరింటెండెంట్
సుచిత్రా దాస్	సూపరింటెండెంట్

పెద్ద ఎత్తున గంజాయి స్వాధీనం



ట్రక్కులో గంజాయి పట్టుకున్న పోలీసులు



పాలిథీన్ బ్యాగ్‌లో గంజాయి ప్యాకెట్లు



మెజిస్ట్రేట్ సమక్షంలో తూస్తున్న గంజాయి



పట్టుబడిన గంజాయితో నిందితులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ పోలీసులు పెద్ద ఎత్తున గంజాయిని పట్టుకున్నారు. బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజళీ ప్రధాన్ శనివారం వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒక ట్రక్కులో బొయిపరిగుడ సమితి దశమంతపూర్ నుంచి బొయిపరిగుడ మార్గంలో గంజాయి తీసుకు వెళ్తున్నారన్న సమాచారం పోలీసు అధికారి దీపాంజళీ ప్రధాన్ కు అందింది. సమాచారం అందిన వెంటనే పోలీసు అధికారి వెంటనే సబ్‌ఇన్‌స్పెక్టర్ డి.బారిక్‌ను వెంటనే వెళ్లమని ఆదేశించగా ఆయన పోలీసులతో బొయిపరిగుడ, దసమంతపూర్ మార్గంలో కుర్లగడ్డ కూడలి వద్ద మాటు వేశారు. ఒక అశోక్ లేలాండ్ తెల్లని రంగు ట్రక్కు అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు ఆపి తనిఖీ చేశారు. దీంతో అందులో గంజాయి దొరికింది. మొత్తం 273 కిలోలు ఉన్నట్లు గుర్తించారు. ఆ వాహనంలో ఉన్న ఇద్దరిని అరెస్టు చేశామని వెల్లడించారు. వారు ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ఫిరోజాబాద్ జిల్లా జైగోపాల్ మకరందపూర్ గ్రామానికి చెందిన మందీప్ కుమార్, దీపక్ కుమార్‌లని వెల్లడించారు.

క్లుప్తంగా

వృత్తి విద్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని ఎన్టీఆర్ నైపుణ్య కేంద్రం (మహిళా ప్రాంగణం)లో వృత్తి విద్య శిక్షణకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజర్ పి.విమల శనివారం ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ శిక్షణ రెండు నెలలు ఉంటుందని, 10వ తరగతి ఉత్తీర్ణత, 18 నుంచి 35 ఏళ్ల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. టైలరింగ్‌కు ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత అర్హత కాగా, 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, 18 నుంచి 35 ఏళ్ల వారు అర్హులని తెలిపారు. ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9948530183, 7416764419 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కుంభమేళాలో అర్చకుడి మృతి


సుసరాపు వెంకట నరసింహం (ఫైల్)

పోలాకి: మండలంలోని ప్రియాగ్రహారం శివాలయం ప్రధాన అర్చకుడు సుసరాపు వెంకటనరసింహం అలియాస్ చిన్నబాబు(65) శనివారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ నెల 21న ప్రయోగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు కుటుంబసభ్యులతో వెళ్లిన వెంకటనరసింహం అక్కడి నుంచి వారణాశి తదితర క్షేత్రాల సందర్శనకు వెళ్లారు. అక్కడి అతిశీతల వాతావరణం నేపథ్యంలో శ్వాసకోస సమస్యతో బాధపడి మృతి చెందారు. కాశీలోనే అంత్యక్రియల ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

యువకుడు ఆత్మహత్య

గార: కడుపు నొప్పి తట్టుకోలేక కుమ్మరిపేట గ్రామానికి చెందిన కె.శ్రావణ్‌కుమార్ (32) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను ఎచ్చెర్ల ఐఐఐటీలో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజులుగా కడుపునొప్పి సమస్యతో బాధపడుతున్నాడు. శనివారం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.జనార్దన తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

నరసన్నపేట: ఊక లారీలో కలాశీగా పని చేసే ఎలమంచిలి శ్రీనివాసరావు(45) మద్యం మత్తులో మరణించాడు. శనివారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్ పైకి వెళ్లే మెట్లు వద్ద మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ జె. శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శ్రీనివాసరావుకు భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏఎస్ఐ సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు హక్కు అందరి బాధ్యత

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకుంటున్న వృద్ధులను యువత ఆదర్శంగా తీసుకోవాలని అదనపు జిల్లా ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో శనివారం జరిగిన కార్యక్రమానికి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ముందుగా వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్నికల అధికారులు ర్యాలీ చేపట్టారు. ఏడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి అనంతరం బాపూజీ కళామందిర్ చేరుకున్నారు. అనంతరం నూతనంగా ఓటు హక్కు కలిగిన యువతీ, యువకులకు ఓటరు కార్డులు అందజేశారు. ప్రతి ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వయో వృద్ధులకు ప్రశంసా పత్రాలు అందించారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగ ఓటర్లను దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం నియోజకవర్గం ఎన్నికల అధికారి సాయి ప్రత్యూష, డీఈఓ తిరుమల చైతన్య, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.వి.వి.డి. ప్రసాద్, అదనపు ఎస్పీ కె.వెంకటరమణ, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, సన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

విద్య అందరి కోసం..


మారథాన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

• కిస్ కిట్ ఆధ్వర్యంలో మినీ మారథాన్


విజేతగా నిలిచిన చిన్నారి

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని స్టేడియం నుంచి మాల్యవాంత్ హాస్టల్ వరుకు శనివారం కిస్ కిట్ ఆధ్వర్యంలో విద్య అందరి కోసం అనే లక్ష్యంతో మినీ మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథుగా జిల్లా అటవిశాఖ అధికారి ప్రతాప్ కోత్తపల్లి, అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రదాన్, జిల్లా క్రీడా అధికారి మాధవ్ పాంగి హాజరై మారథాన్‌ను ప్రారంభించారు. ఈ మారథాన్‌లో 300 మంది పాల్గొన్నారు. మాల్యవాంత్ హాస్టల్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్ట్ ఆఫ్ గివింగ్ అనే కర్యక్రమం నిర్వహించారు. కిస్ కిట్ వ్యవస్థాపకుడు డాక్టర్ అచ్యుత్ సామంత్, డి.గోపికృష్ణ, రత్నకర్ దాస్, దేవవ్రత సాన, సుబ్రత్ జేనా, రమ్య రంజాన్ పారిడా, ఉత్తమ్ సాహ, సుశాంతో సామల్, బినాస్ మిశ్రో, ప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి


ఎమ్మెల్యే అప్పలస్వామికి సన్మానిస్తున్న సత్యసాయి భక్తులు

రాయగడ: స్థానిక తేజస్వీ మైదానంలో ఈ నెల 23వ తేదీ నుంచి జరుగుతున్న సత్యసాయి సేవా సమితుల రాష్ట్ర స్థాయి సదస్సు శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక హాజరయ్యారు. సేవా దృక్పథంతో ఆవిర్భవించిన సత్యసాయి సేవా సమితి భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరిలో సేవా భావాన్ని నింపేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. పుట్టపర్తికి చెందిన ఎం.బాలచంద్రశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి తరహా సదస్సులు ఒకరిపై మరొకరికి అవినావభావ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆ సాయి భగవానుని ఆశీస్సులు పొందాలన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించేందకు ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన సత్యసాయి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సేవా సమితి రాయగడ శాఖ అధ్యక్షుడు ఎస్.వి.రమణ మూర్తి ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది.


సదస్సుకు హాజరైన వివిధ ప్రాంతాలకు చెందిన సాయి భక్తులు


ప్రసంగిస్తున్న బాలచంద్ర శేఖర్

ఘనంగా విజయ్ దివస్


బీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేస్తున్న జవాన్లు, గ్రామస్తులు


వృద్ధులకు రగ్గులు అందజేస్తున్న జవాన్లు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జోడాంబ్ పంచాయతీలో శనివారం బీఎస్‌ఎఫ్ జవాన్లు విజయ్ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఐదేళ్ల కిందట ఈ ప్రాంతంలో విజయ్ దివస్‌ను ప్రారంభించారు. ఒకప్పుడు ఇక్కడ నిత్యం తుపాకీ చప్పుళ్లు వినిపించేవి. అలాంటి ప్రాంతానికి బీఎస్‌ఎఫ్ జవాన్లు వచ్చి శాంతి నెలకొల్పారు. ఒకప్పుడు ఈ చిత్రకొండ సమితిని కటాఫ్ ఏరియాగా పిలిచేవారు. ఇక్కడ 9 పంచాయతీలు జోడాంబో, జాంత్రీ, పనాస్‌పూట్, గురసేత్, గాజాల్‌మమ్ముడి, రల్లేగడ్డ, పెప్పర్‌మేట్ల, బోడఫోధ, బోడఫోధర్ ప్రాంతాలు పూర్తిగా మావోల కబ్జాలో ఉండేవి. తొలిసారి 2020లో మావోలపై తిరుగుబాటు జరిగింది. అది చూసిన మావోలు జోడాంబో పంచాయతీ జంతురాయి గ్రామంపై దాడి చేసి 20 ఇళ్లను కాల్చేశారు. విషయం తెలిసిన బీఎస్‌ఎఫ్ జవాన్లు మావోల పంజా నుంచి ఆ ప్రాంతాన్ని రక్షించారు. అప్పటి నుంచి ఏటా జనవరి 25న ఇక్కడ విజయ్ దివస్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఇక్కడ జాతీయ జెండా ఎగురవేశారు. జనసంపర్క్ శిబిరం ఏర్పాటు చేసి అన్నదానం చేశారు.

జయపురంలో పంచాయతీరాజ్ డైరెక్టర్ పర్యటన


డొంగరచించిలో పార్క్‌ను పరిశీలిస్తున్న మహేశ్వర స్వైి

జయపురం: జయపురం సమితిలో పంచాయతీ రాజ్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ మహేశ్వర్ స్వైి శనివారం పర్యటించారు. డొంగరచించి, ఉమ్మిరి, జయంతిగిరి గ్రామ పంచాయతీల్లోని వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి సమీక్షించారు. 326 విజయవాడ–రాంచీ జాతీయ రహదారి, డొంగరచించి ప్రాంతంలో నిర్మించిన పార్క్‌ను సందర్శించారు. ఉమ్మిరిలో మహాత్మా గాంధీ గ్రామీణ రోజ్‌గార్ యోజన, సి.ఎఫ్.సి నిధులతో చేపట్టిన బ్రాహ్మణ దేయి చెరువు పునరుద్ధరణ పనులపై సమీక్షించారు. వెంటనే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జయంతిగిరి పంచాయతీలో హడప గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆవాస యోజన ఇళ్లను పరిశీలించారు. జయంతిగిరి పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చుతున్న నిధులు సక్రమంగా వినియోగించి అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో జిల్లా ప్రధాన డవలప్‌మెంట్ అధికారి బేణుదర శబర, ఎ.సి.డి(గ్రామీణ అవాస్ యోజన) గౌరీశంకర సాహు, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి యుగల్ నాయక్, జయపురం అదనపు బీడీఓ మనోజ్ కుమార్ నాయక్, ప్రభుత్వ కార్యనిర్వాహక ఇంజినీర్ బిజయ నందో, పీఈఓ శ్రీనివాస పట్నాయక్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రిమ్స్ రోగులకు ఎంఆర్ఐ కష్టాలు

• మెదడుకు సంబంధిత రోగికి స్కానింగ్ చేయకుండానే డిశ్చార్జి
• అధికారులకు ఫిర్యాదు చేశాడని కక్ష


బాధితుడు సింహాచలం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ సర్వజన ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లే పేద రోగులకు ఎంఆర్ఐ(మ్యాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్) స్కానింగ్ గగనమవుతోంది. గార మండలం గోరువానిపేటకు చెందిన 54 ఏళ్ల కార సింహాచలం ఈ నెల 16న మెదడు సంబంధిత సమస్యతో రిమ్స్‌కు వచ్చారు. పరిశీలించిన వైద్యులు మరిన్నీ పరీక్షలు అవసరమని, ఇన్‌పేషెంట్‌గా చేర్చారు. ఈ నెల 18న సీటీ స్కాన్ సిఫారసు చేయడంతో 19న స్కాన్ చేయించారు. 20న రిపోర్టు రాగా, అందులో స్పష్టత లేదంటూ ఎంఆర్ఐ స్కాన్ చేయించాలని కేసు షీట్‌లో నమోదు చేశారు. ఆ రోజు నుంచి ఎంఆర్ఐ స్కాన్ చేయించేందుకు రోగి బంధువులు ఉదయం వస్తే మధ్యాహ్నం రావాలని, మధ్యాహ్నం వస్తే రేపు రావాలని సాగదీత ధోరణితో వ్యవహరించారు. విసిగిపోయిన బంధువులు శుక్రవారం ఆర్ఎంవో డాక్టర్ రమేష్‌నాయుడుకు విషయం చెప్పారు. ఆయన స్వయంగా వచ్చి సీటీ స్కాన్ చేయాలని ఆదేశించారు. అయినా సిబ్బంది తాత్సారం చేయడంతో తిరిగి ఆర్ఎంవోను ఆశ్రయించారు. రోగి సహకరించడం లేదని, ఎవరైనా సర్జన్ ఉంటే మత్తు ఇచ్చి చేస్తామని చెప్పడంతో ఇదే విషయాన్ని వార్డులో చెప్పారు. శుక్రవారం సాయంత్రం వార్డులోని ఓ స్టాఫ్ నర్సు ఎంఆర్ఐ వద్దకు వచ్చి శాంపిల్ డోస్ అంటూ మత్తు మందు ఇచ్చారు. అయినా రోగి కదలడంతో శనివారం రావాలని అక్కడ సిబ్బంది సూచించారు. రోజూ ఏదో సాకు చెబుతున్నారన్న ఉద్దేశంతో రోగి బంధువులు ఉదయం ఆరుగంటలకే వెళ్లి మొట్టమొదటగా రోగికి సంబంధించిన కేసు షీటు ఇచ్చారు. అయినా స్కాన్ చేయకుండా కేసులు ఎక్కువున్నాయని.. సోమవారం రావాలని చెప్పడంతో ఆర్ఎంవో, సూపరింటెండెంట్ షకీలాకు విషయాన్ని వివరించారు. ఆమె చెప్పినా అక్కడ ఎంఆర్ఐ తీయకుండా అక్కడ ఇన్‌చార్జిగా ఉన్న రఘునాథరావు రోగిని డిశ్చార్జి చేయాలని, వారం రోజుల తర్వాత రావాలని ఆదేశించారు. విషయాన్ని మళ్లీ సూపరిటెండెంట్ దృష్టికి తీసుకెళ్లగా మత్తు నిపుణుల పర్యవేక్షణలో జరగాలని, అందుకే వాయిదా వేసి ఉండవచ్చని చెప్పారు. ఇది వాస్తవమే కాగా శుక్రవారం స్టాఫ్ నర్సు ద్వారా మత్తు ఇంజక్షన్ ఎలా ఇచ్చారన్న ప్రశ్నకు ఆమె నుంచి సమాధానం రాలేదు. తొలుత సోమవారం రావాలని చెప్పిన సిబ్బంది అటు తర్వాత వారం రోజుల తర్వాత రావాలని ఆమె దృష్టికి తీసుకెళ్లగా, అలా జరగకూడదే అంటూ సిబ్బందిని ప్రశ్నిస్తానని చెప్పి వెళ్లిపోయారు. నాలుగేళ్ల క్రితం సింహాచలంకు బ్రెయిన్ స్ట్రోక్ రాగా నెమ్మదిగా కోలుకొని, తిరిగి ఇటీవలే వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నారని, మళ్లీ స్ట్రోక్ వస్తే పరిస్థితి ఏంటని కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. గత్యంతరం లేక రోగిని తీసుకొని బంధువులు ఇంటిముఖం పట్టారు. కాగా, ఎంఆర్ఐ స్కాన్ వద్ద కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు రోగులు ఆరోపిస్తున్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో సత్తాచాటిన పలాస విద్యార్థి


బహుమతి అందుకుంటున్న జశ్వంత్ పాత్రో

కాశీబుగ్గ: పలాస హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న జశ్వంత్ పాత్రో ప్రతిభ కనబరిచాడు. తాను తయారు చేసిన రీజనరేట్ బ్రేకింగ్ సిస్టమ్స్ ప్రాజెక్టుకు పుదుచ్చేరిలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ – 2025లో మూడో స్థానం దక్కింది. అక్కడి స్పీకర్, మంత్రుల చేతులమీదుగా ట్రోఫీ, సర్టిఫికెట్, నగదు బహుమతి అందుకున్నట్లు పాఠశాల హెచ్ఎం దాశరథి శనివారం తెలిపారు. విద్యార్థితో పాటు గైడ్ టీచర్ షణ్ముఖరావును అభినందించారు.

ఖాతాలన్నీ ఖాళీ.. నిధులన్నీ లూటీ!

• అరసవల్లి ఆదిత్యాలయంలో ఆరు నెలలకే వార్షిక బడ్జెట్ ఖాళీ
• రెగ్యులర్ సిబ్బంది జీతాలు మినహా మిగిలిన ఖాతాల్లో సొమ్ములు నిల్
• కాంట్రాక్ట్ ఉద్యోగి జగన్మోహనరావుపైనే అనుమానాలు
• ఇప్పటికే రెండు నెలల జీతం కట్
• సమగ్ర విచారణ కోరుతూ విజిలెన్స్‌కు ఫిర్యాదుల వెల్లువ

అరసవల్లి: 'గోశాలలో ఆవులకు మేతగడ్డి కొనడానికి డబ్బులు లేవు.. అన్నదానానికి కొన్న కూరగాయలకు ఇవ్వడానికి డబ్బులు లేవు.. ఇతరత్రా సామగ్రి కొనుగోలుకు హెడ్ ఖాతాల్లో పైసా లేదు..'' ఇదీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్య నారాయణ స్వామి ఆలయంలో ప్రస్తుత పరిస్థితి. అరసవల్లి ఆలయానికి డిప్యూటీ కమిషనర్ (డి.సి) హోదాతో అప్‌గ్రేడ్ చేయడంతో ఉద్యోగుల సంఖ్య పెరగడంతో పాటు ఆలయంలో స్వామి వారి సేవలు, కైంకర్యాలు, దినసరి వేతనదారులు, ఇతరత్రా సౌకర్యాల కల్పనకు, పరిపాలనాంశాలకు గాను 2024–25 వార్షిక బడ్జెట్‌ను సుమారు రూ.22 కోట్లకు దేవదాయ శాఖ కమిషనరేట్ నుంచి ఆమోదం పొందారు. ఈ మొత్తాన్ని హెడ్‌ల వారీగా ఏడాది పాటు ఖర్చు చేయాల్సి ఉండగా ప్రస్తుతం ఆరేడు నెలలకే నిధులు ఖాళీ అయిపోవడం చర్చనీయాంశమైంది. దీనంతటికీ క్యాష్‌బుక్‌ను మెయింటైన్ చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగి (గ్రేడ్-2 ఈవో) పి.జగన్మోహనరావే కారణమని, ఇతనికి రెగ్యులర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగి కూడా సహకరించినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

రిటైర్డ్ ఉద్యోగి చేతిలో క్యాష్ బుక్..!

నిన్నటి వరకు దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌గా పనిచేసిన ఎస్.సత్యనారాయణ తనకు సమీప బంధువంటూ రిటైర్డ్ ఉద్యోగి జగన్మోహనరావు ఆలయంలో కన్సాలిడేటెడ్ ఉద్యోగిగా చేరి అజమాయిషీ చెలాయించారు. కార్యనిర్వహణాధికారులు ఎవరున్నా కీలకమైన అకౌంట్స్, క్యాష్ బుక్ మాత్రం తనవద్దే ఉంచుకుంటూ లావాదేవిలు కొనసాగించారు. ఇష్టారాజ్యంగా ఖర్చులు చేసేసి తప్పుడు బిల్లులతో ఆడిట్‌కు పంపించేయడంతో చాలావరకు హెడ్‌లు ఖాళీలయ్యాయి. 2024–25 వార్షికంలో తొలి నెలల్లో పనిచేసిన ఈవోల హయాంలో దొంగబిల్లులను పెట్టడం, అధిక ఖర్చులు చేసినట్లు ఆరోపణలున్నాయి. కన్సాలిడేటెడ్ ఉద్యోగుల జీతభత్యాలు చెల్లించే హెడ్ కూడా ఖాళీ కావడంతో రెండు నెలలుగా జగన్మోహనరావుకు కూడా జీతాలు ఆపేశారు.

విజిలెన్స్‌కు ఫిర్యాదులు..

అరసవల్లిలో జరిగిన పలు అక్రమాలపై రిటైర్డ్ ఉద్యోగి పి.జగన్మోహనరావు, అప్పటి ఈవో చంద్రశేఖర్, కంప్యూటర్ ఆపరేటర్ బి.యుగంధర్‌లపై ఇప్పటికే విజిలెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఆడిట్‌కు దొరక్కుండా దొంగ బిల్లులతో అక్రమాలు, ఈవో చంద్రశేఖర్‌కు ఇతోధికంగా సాయం చేసేందుకు ఆలయ నిధులను వినియోగించడంపై జగన్మోహన్‌రావుపై ఫిర్యాదు పంపించారు. గత ఈవో చంద్రశేఖర్ హయాంలో చెక్కులు డ్రా చేసిన తేదీలు, ఆడిట్‌కు సబ్‌మిషన్ తేదీల వ్యత్యాసాలపై ఫిర్యాదులు వెళ్లాయి. వీటితో పాటు ఫోర్జరీ సంతకంతో ఉద్యోగం చేస్తున్నాడంటూ కంప్యూటర్ ఆపరేటర్ యుగంధర్‌పై కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణలో భాగంగా పాత్రధారులను నేరుగా విజిలెన్స్ అధికారులే పిలిపించుకుని విచారణ చేపట్టినట్టు సమాచారం. మొత్తం అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని భక్తులు కోరుతున్నారు.

ఆరు నెలల్లో అంతా ఖాళీ..


అరసవల్లి ఆదిత్యాలయం

అరసవల్లి ఆదిత్యాలయంలో సుమారు 38 రకాల వివిధ హెడ్‌లు క్రింద స్వామి వారి కైంకర్యాలు, పరిపాలనాంశాలు నడుస్తాయి. ఇందుకోసం 2024–25 వార్షిక బడ్జెట్ సుమారు రూ.22 కోట్లు మంజూరు చేయించుకున్నారు. ఇందులో ప్రధానంగా రెగ్యులర్, కాంట్రాక్ట్ సిబ్బంది జీతాలకు రూ.2.20 కోట్లు, అన్నదానానికి రూ.1.20 కోట్లు, ప్రసాదాల తయారీకి రూ.2 కోట్లు, చైత్ర మాసంలో ఆదిత్యుని వార్షిక కల్యాణం, వైశాఖ మాసం, కార్తీక మాసం, తెప్పోత్సవం, వైకుంఠ ఏకాదశి, రథసప్తమి, మాఘమాసం తదితర పర్వ దినాల నిర్వహణ ఏర్పాట్లకు సుమారు రూ.1.50 కోట్లు వరకు వార్షికంగా బడ్జెట్ ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే గత ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు నాటికే బడ్జెట్ హెడ్‌లన్నీ దాదాపుగా ఖాళీలయ్యాయి. లెక్కలను తారుమారు చేయడం, నిర్వహణ పనులంటూ చాలా వరకు బిల్లులు పెట్టి అన్నదానం, ప్రసాదాల హెడ్‌లన్నీ ఖాళీ చేసేశారు. దీంతో సెప్టెంబర్ నుంచి అన్నదానానికి గాను కూరగాయల సరఫరా వ్యాపారికి బకాయిలు రూ.4 లక్షలు, వస్త్రాలు, కండువాల విక్రయ దుకాణానికి రూ.లక్ష, వివిధ ఫర్నిచర్ షాపులకు రూ.2 లక్షల వరకు, ఆవుల మేత గడ్డి కోసం రూ.25 వేల వరకు బకాయిలున్నట్లు సమాచారం.

☛ కొన్ని నెలల ముందు వరకు పనిచేసిన ఈవో చంద్రశేఖర్ హయాంలో కేవలం 20 రోజుల్లోనే సుమారు రూ.6 లక్షల వరకు ఖర్చు చేసినట్లుగా తర్వాత విధుల్లోకి వచ్చిన ఈవో రమేష్‌బాబు గుర్తించి ఆ ఖర్చుల బిల్లులపై అభ్యంతరాన్ని వ్యక్తం చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

☛ పాలు, మజ్జిగ పంపిణీ, ప్రసాదాల పంపిణీ, మంచినీటి ప్యాకెట్లు రూపేణా రూ.25 లక్షల వరకు ఖర్చులకు ప్రీ ఆడిట్‌కు పంపించకుండా చెక్కులను డ్రా చేసేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో అప్పటి ఈవోలకు చేతిడబ్బులు ఇవ్వడంతో పాటు అదనంగా జేబులు నింపుకున్నట్లుగా రిటైర్డ్ ఉద్యోగి జగన్మోహనరావుపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

☛ ఇతర దేవాలయం నుంచి వచ్చి ఇక్కడ డిప్యుటేషన్‌లో పనిచేసిన ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపు కింద చెల్లింపులు, ఎరియర్స్‌తో కలిపి రూ.లక్షల్లో చెల్లించడం కూడా కూడా బడ్జెట్‌కు భారమయ్యిందనే వాదనలున్నాయి.

హెడ్‌లు ఖాళీ అయినట్లు గుర్తించాం..



నేను విధుల్లోకి రాకమును పే.. వార్షిక బడ్జెట్ హెడ్‌లో చాలా వరకు ఖర్చులైనట్లు చూపిస్తున్నారు. ఈ లోటు కారణంగా చాలా వరకు బకాయిలు చెల్లించలేకపోతున్నాం. కన్సాల్డేటెడ్ ఉద్యోగి జగన్మోహనరావుకు కూడా రెండు నెలల నుంచి జీతాలు చెల్లింపు నిలిపేశాం. తదుపరి సప్లమెంటరీ బడ్జెట్ పెట్టాల్సి ఉంది. అప్పుడే జీతాలు, బకాయిల సంగతి తేలుతుంది. విజిలెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లిన అంశం కూడా నా దృష్టికి వచ్చింది.

– వై.భద్రాజీ, ఆలయ ఈవో, అరసవల్లి

ఆచార్య పోస్టుల భర్తీకి మోక్షమెప్పుడో?

• రిమ్స్‌లో 11 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ
• రాష్ట్ర అధికారికి ఐదు నెలల క్రితం సీనియారిటీ జాబితా
• 61 మందిలో ముగ్గురికే పదోన్నతి

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలో 11 ఆచార్య (ప్రొఫెసర్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరునెలలుగా ప్రభుత్వం పదోన్నతులు చేపట్టకపోవడంతో ఇన్‌చార్జిలతోనే ఆయా విభాగాలు కొనసాగుతున్నాయి. పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, రేడియేషన్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, పలమనరి మెడిసిన్, జనరల్ సర్జరిలో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయి. ఈ విభాగాలన్నీ ప్రస్తుతం అసోసియేట్ ప్రొఫెసర్ల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి.

గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు భర్తీలు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఎప్పటికప్పుడు పదోన్నతులు, పోస్టుల భర్తీలు జరిగేవి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం తర్వాత పదేళ్లపాటు వైద్యులపదోన్నతి నోచుకోలేదు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాకే రాష్ట్ర వ్యాప్తం ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ అవుతుండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. పోస్టుల భర్తీ అటకెక్కింది. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు కూడా పది వరకు ఖాళీగా ఉన్నాయి. అంకాలజీలో మూడు, న్యూరాలజీ, న్యూరో సర్జన్, కార్డియాలజీ సర్జన్, బయోకెమిస్ట్రీ, ఎమెర్జెన్సీ మెడిసిన్, నెఫ్రాలజీ, జనరల్ కార్డియాలజిస్ట్‌లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయి. వీటిని కూడా పదోన్నతిలపై భర్తీ చేస్తే కొంతమేర నిరుద్యోగ సమస్య తీరినట్టు అవుతోంది. వైద్య విద్యార్థులకు మంచి బోధన, రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందే అవకాశం ఉంటుంది. అయినా ప్రస్తుత ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయడం లేదు.

ముగ్గురికి మాత్రమే..

ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన సీనియారిటీ జాబితా ఐదు నెలల క్రితమే రాష్ట్ర అధికారి టేబుల్ పైకి వెళ్లినట్టు సమాచారం. 61 మంది అర్హులతో జాబితాను సిద్ధం చేశారు. సెప్టెంబర్‌లో జాబితా రూపొందించగా సుమారు 5 నెలల పాటు పెండింగ్‌లో పెట్టేశారు. తాజాగా ఈ జాబితాలో ముగ్గురికి మాత్రమే పదోన్నతులు కల్పించారు. వీరికంటే సీనియర్లున్నప్పటికీ వారిని పక్కనపెట్టేశారు. రాష్ట్ర చరిత్రలో ఇలా జరగడం తొలిసారని వైద్యులు చెబుతున్నారు. రిమ్స్ వైద్య కళాశాలలో పదోన్నతులకు అర్హులైన వారు ఐదుగురు వరకు ఉన్నారు. ఇదంతా పదోన్నతులు కోసం ఎదురుచూస్తుండగా.. రోగులు గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన అంకాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ వంటి సూపర్‌స్పెషాలటీ వైద్యసేవలు కోసం ఎదురుచూస్తున్నారు.

క్లుప్తంగా

ఏపీఎస్ఆర్టీసీ బలోపేతానికి చర్యలు

- ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఎస్.దన్నుదొర


ఆర్టీసీ జోనల్ చైర్మన్ దన్నుదొర

రామభద్రపురం: ఏపీఎస్ఆర్టీసీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఎస్.దన్నుదొర అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ జోనల్ పరిధిలో ఆర్టీసీకి ప్రయాణికుల ద్వారా సుమారు రూ.4.50 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద జాతరైన శంబర జాతరకు ఎక్కువ బస్సులు నడిపేందుకు అధికారులు దృష్టి సారించారన్నారు. గిరిజన గ్రామాలలో ఇదివరలో నడిపి ఆగిన బస్సులను తిరిగి పునరుద్ధరిస్తామని చెప్పారు. రామభద్రపురం మండలం ఎనుబరువు గిరిజన గ్రామానికి సాలూరు డిపో నుంచి పాచిపెంట మీదుగా పల్లెవెలుగు బస్సు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆదివాసీ సాంస్కృతిక మహోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ స్థాయి ఆదివాసీ సాంస్కృతిక మహోత్సవాల వాల్‌పోస్టర్లను ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. భారత దేశంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు అక్కులప్పనాయక్, విష్ణునాయక్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

179 మద్యం సీసాల సీజ్

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామం సమీపంలో 110 మద్యం సీసాలను తరలిస్తున్న మరుపల్లి గ్రామానికి చెందిన లెంక సురేష్ అనే వ్యక్తిని శనివారం అదుపులోకి తీసుకొని మద్యం సీసాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. షాపుల్లో కొనుగోలు చేసి ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం వ్యాపారాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. గజపతినగరం మండల కేంద్రంలో జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద బొండపల్లి మండలం దేవుపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి సైకిల్‌పై 69 (బాటిల్స్)మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తుండగా ఆయనను శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకోవడం జరిగిందని స్థానిక ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. మొత్తం ఇద్దరు వ్యక్తుల నుంచి 179మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

శంబర జాతరకు ప్రత్యేక బస్సులు

సాలూరు: శంబర జాతర నేపథ్యంలో సాలూరు ఆర్టీసీ డిపో నుంచి శంబరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం భాస్కరరెడ్డి శనివారం తెలిపారు. జాతర నేపథ్యంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని ఈ క్రమంలో ప్రత్యేక బస్సులు నడపనున్నామని అన్నారు. ఆదివారం 5 బస్సులు, సోమవారం 10 బస్సులు, మంగళవారం 25 బస్సులు, బుధవారం 10 ప్రత్యేక బస్సులు నడపనున్నామని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: విజయనగరం కోరుకొండ రైల్వేస్టేషన్‌ల మధ్య రైల్వే ట్రాక్ మధ్యలో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం పడి ఉందని జీఆర్‌పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు శనివారం తెలిపారు. సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి ఐదడుగుల నాలుగు అంగుళాల ఎత్తు కలిగి, చామన ఛాయ రంగు, బిస్కెట్, కాఫీ రంగు పువ్వుల షర్ట్, నీలం రంగు ఫుల్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9490617089 నంబరునుగాని, జీఆర్‌పీ పోలీసులనుగానీ సంప్రదించాలని కోరారు.

సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణే ధ్యేయం

- ట్రస్ట్ అసోసియేషన్ చైర్మన్ ఆర్ఎస్ జాన్



మాట్లాడుతున్న సీబీసీఎన్‌సీ ట్రస్ట్ చైర్మన్ ఆర్ఎస్.జాన్

విజయనగరం టౌన్: కన్వెన్షన్ ఆఫ్ ది బాప్టిస్ట్ చర్చ్ ఆఫ్ ది నార్తరన్ సర్కార్స్ (సీబీసీఎన్‌సీ) ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ట్రస్ట్ ప్రతినిధులపై ఉందని ట్రస్ట్ అసోసియేషన్ చైర్మన్ ఆర్ఎస్.జాన్ స్పష్టం చేశారు. సీబీసీఎన్‌సీ 70వ ఐక్య మహాసభలను స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ పక్కనున్న సిమ్స్ బాప్టిస్ట్ చర్చిలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టి. ఆనందరావు, జామి శరత్, కుమార్, వై.ప్రభాకర్, బాలచందర్, ఎం.రజాకర్, తదితరులు పాల్గొన్నారు.

అధికార హుకుం..!

- అధికార పార్టీ నేతల దందా..
- రైతులతో రాజకీయం
- కూటమి నేతలు చెబితేనే డ్రోన్‌లు ఇస్తారట..!
- జిల్లాకు 25 డ్రోన్లు మంజూరు



- సార్ నేను డ్రోన్ కోసం దరఖాస్తు చేసాను. ఎప్పుడు ఇస్తారని ఓ రైతు సంబంధిత వ్యవసాయ అధికారిని అడిగాడు. సదరు అధికారి అధికార పార్టీకి చెందిన నేతతో ఓ మాట చెప్పించండి.. మీకు డ్రోన్ మంజూరు అయిపోతుందని చెప్పినట్టు తెలిసింది. అంతేకాకుండా డ్రోన్‌కు రాయితీ ఎక్కువగా ఇస్తున్నందున అధికార పార్టీ నేతలు చెప్పిన వారికే ఇవ్వాలని ఉన్నత అధికారుల నుంచి మాకు ఆదేశాలు వచ్చాయని రైతుతో అన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయంలో సాగు కోసం డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు అధికారుల నుంచి ఎదురవుతున్న అనుభవాలు కూటమి నేతల అధికార పెత్తనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. అందరికీ అన్నం పెట్టే రైతన్నతోనూ కూటమి నేతలు రాజకీయం చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా కూటమి నేతలు చెప్పినట్టు వ్యవహరిస్తున్నారు. కూటమి నేతలను ప్రసన్నం చేసుకుంటేనే డ్రోన్లు ఇస్తామని అధికారులు ఖరాఖండిగా చెబుతుండడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

జిల్లాకు 25 డ్రోన్‌లు మంజూరు

జిల్లాకు 25 డ్రోన్‌లు మంజూరయ్యాయి. జిల్లాలో 27 మండలాలు ఉన్నప్పటికీ 25 మాత్రమే మంజూరయ్యాయి. వీటి కోసం కొంతమంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారు కూటమి పార్టీకి వారికి చెందిన వారా.. లేదా ఇతర పార్టీలకు చెందిన వారా.. అని అధికార పార్టీ నేతలు వాకబు చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు అయితే వారికి డ్రోన్ నిలిపివేయాలని సంబంధిత వ్యవసాయ అధికారులకు అధికార పార్టీ నేతల నుంచి ఆదేశాలు వెళ్లినట్టు తెలిసింది.

మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పిన వారికే ఇవ్వాలని ఆదేశాలు

జిల్లాకు మంజూరైన డ్రోన్‌లను అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పిన వారికే ఇవ్వాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు వచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని నియోజకవర్గాల్లోను ఆ విధంగా చేయాలని ఆదేశాలు వచ్చినట్టు సర్వత్రా చర్చ జరుగుతుంది. అధికార పార్టీ అండగాని, అధికార పార్టీకి చెందిన కార్యకర్త అయితే తప్ప డ్రోన్ మంజూరు కాదనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

80 శాతం రాయితీ

ఒక్కో డ్రోన్‌కు 80 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు. డ్రోన్ విలువ రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు వరకు ఉంది. ఇందులో ప్రభుత్వం రూ.8 లక్షల వరకు రాయితీ ఇస్తుంది. మిగతాది రైతు భరించాల్సి ఉంటుంది. రాయితీ ఎక్కువగా ఇస్తున్నాం.. కాబట్టి ఆ లబ్ధి కూడా కూటమికి చెందిన కార్యకర్తలే లబ్ధి పొందాలని కూటమి సర్కార్ యోచిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజాప్రతినిధుల సూచనలు కూడా తీసుకుంటున్నాం..

జిల్లాకు 25 డ్రోన్లు మంజూరయ్యాయి. డ్రోన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఇప్పుడు డ్రోన్ తీసుకోవడానికి ఇష్టపడుతున్నారా.. లేదా.. అని అడుగుతున్నాం. డ్రోన్‌లు మంజూరులో ప్రజాప్రతినిధుల సూచనలు కూడా తీసుకుంటున్నాం.

– వి.తారకరామారావు,
జిల్లా వ్యవసాయ అధికారి

ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి

- డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

విజయనగరం ఫోర్ట్: ఎన్నికల ముందు చెప్పిన సూపర్ - 6 హామీలు అన్నింటిని కూటమి ప్రభుత్వం నేరవేర్చాలని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ డిమాండ్ చేసారు. ఈథాలీ భజావో కార్యక్రమం పేరిట కలెక్టరేట్ వద్ద ప్లేట్లు - స్పూన్లతో పెద్ద శబ్దం చేస్తూ శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి సర్కార్ ఏర్పడి నేటికి 227 రోజులు అయిందన్నారు. ఇప్పటి వరకు ఫించన్లు, ఉచిత గ్యాస్ తప్ప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, పథకాలు అమలు చేయలేదన్నారు. బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారంటీ అని బాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా మూలన పెట్టారన్నారు. యువతకు 20 లక్షలు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి క్రింద నెలకు రూ.3 వేలు, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, ఇంట్లో ఎంతమంది చదివితే అంతమందికి ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం, ప్రతి మహిళకు 18 నుంచి 59 సంవత్సరాల వయసుగల వారికి నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి ప్రజలను మోసం చేసారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయకపోవడం వల్ల పిల్లలు చదువులకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్లు గేదెల తిరుపతిరావు, సతీష్, సురేష్, శ్రీనివాస్‌రావు, షరీఫ్, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామాయణంలోని విలువలను తెలుసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న వారికి జ్ఞాపికల అందజేత

విజయనగరం రూరల్: రామాయణంలోని విలువలను నేటి తరం తెలుసుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వేమకోటి సూర్యనారాయణ శర్మ పిలుపునిచ్చారు. మండలంలోని రామనారాయణ ప్రాంగణంలో రెండో రోజు శనివారం నిర్వహిస్తున్న యువ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సంభాషించారు. రామాయణంలోని ఉన్న అద్భుతమైన పలు అంశాలను నేటితరం యువతకు తెలియజేసేలా ప్రయత్నిస్తున్న నారాయణం శ్రీనువాస్ కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రామాయణంలోని పలు ఘట్టాలను నాటక రూపంలో పలువురు విద్యార్థులు ప్రదర్శన చేశారు. అనంతరం పాడుతా తీయగా గాయకులు పరమేష్ రామాయణంలోని పలు అంశాలపై అనర్గళంగా మాట్లాడి పలువురు ప్రశంసలను అందుకున్నారు. అనంతరం కార్యక్రమంలో చివరగా వేదికపై ఉన్న ఆహుతులకు, విద్యార్థులకు జ్ఞాపికలను బహుకరించారు.

29న జాబ్‌మేళా

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ, ఐటీఐ సంయుక్తంగా నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాకు 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీయువకులు అర్హులని అన్నారు. జాబ్ మేళాకు ఎల్‌జీ ఎల్రక్టానిక్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, హెట్రో ల్యాబ్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు తదితర బహుళజాతి కంపెనీలు హాజరుకానున్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీయువకులు హెచ్‌టీటీపీ//ఎస్ఐపీయూఎస్‌వైఏఎం.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్ సైట్‌లో నమోదుచేసుకొని అడ్మిట్ కార్డుతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్స్ ఒరిజినల్, జిరాక్స్‌తో పాటు ఒక పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 7286042743, 998853335 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ అధికారులు వీరే...

పార్వతీపురం టౌన్: గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులకు అవార్డులు లభించనున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందుకోనున్నారు.

అవార్డులకు ఎంపికైన జిల్లా అధికారులు

జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, డీఎం సీఎస్ పి.శ్రీనివాసరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఈఓ డి.మంజులావీణ, ఇరిగేష్ ఈఈ ఆర్.అప్పలనాయుడు, డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, జిల్లా ప్లానింగ్ అధికారి పి.వీర్రాజు, డీఈఓ ఎన్.తిరుపతినాయుడు, ఎస్సీ వెల్ఫేర్ అధికారి ఎండీ గయాజుద్దీన్, డీఎస్ఏఓ ఎస్.వెంకటేశ్వరరావు, ఎంవీఐ ఎం.శశికుమార్, డీజేబుల్స్ ఏడీ కె.కవిత, సెట్విజ్ సీఈఓ ఆర్.రామగోపాల్, జిల్లా డ్రగ్ అధికారి షేక్ ఆశా, అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్.

వ్యాకులమాత పుణ్యక్షేత్రంలో నవీనా ప్రార్థనలు


ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవ సోదరులు

కొత్తవలస: మండలంలోని గొల్లలపాలెం గ్రామ సమీపంలో గల కొండడాబాల ఆర్‌సీఎం చర్చ వ్యాకులమాత పుణ్యక్షేత్రం యాత్ర మహోత్సవం సందర్భంగా నవీనా ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి.

రెండో రోజు శనివారం పరిశుద్ధ దివ్యబలి పూజను గురుశ్రీ వర్గీస్‌చాపరత్ నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన సాలిగ్రామపురం, వెంకోజీపాలెం, సీతమ్మధార చర్చల విచారణ కర్తలు, విచారణ భక్తి సంఘాలు పాల్గొన్ని ప్రత్యేక ప్రార్థనలు చేసారు. గురుశ్రీ ఎస్.పీటర్ ప్రసంగిస్తూ మరియతల్లి నరీక్షణ – శ్రీసభనిరీక్షణ కోసం వివరిస్తూ ప్రసంగించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

9న ప్రజ్ఞావికాసం పరీక్ష

విజయనగరం పూల్‌బాగ్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న ప్రజ్ఞా వికాసం పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు వెంకటేష్ తెలిపారు. పరీక్షకు సంబంధించి వాల్‌పోస్టరును ఎల్‌బీజీ భవన్‌లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞావికాసం పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇందులో పాల్గొని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు బహుమతిగా ఇవ్వనున్నట్టు తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు ఫిబ్రవరి 1వ తేదీలోపు ఫీజు రూ.30 చెల్లించి పేర్లు నమోదు చేసుకుని హాల్‌టిక్కెట్ తీసుకోవాలన్నారు. వివరాలకు 75692 90549, 79975 32521 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రాజశేఖరం జీవితం ఆదర్శం

- పాలవలస సంతాప సభలో రాజకీయ ప్రముఖుల నివాళులు
- రాజశేఖరం ఆశయ సాధనకు పిలుపు
- కుటుంబానికి అండగా వైఎస్సార్‌సీపీ
- ఎమ్మెల్సీ బొత్స, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి అంబటి, మాజీ మంత్రులు ధర్మాన సోదరులు
- తండ్రి ఆశయాలను నెరవేర్చుతామన్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి


రాజశేఖరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భార్య ఇందుమతి, కుటుంబ సభ్యులు, పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

పాలకొండ/వీరఘట్టం: రాజకీయ కురువృద్ధుడు పాలవలస రాజశేఖరం నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని శాసన మండలి విపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పాలకొండలో శనివారం నిర్వహించిన పాలవలస రాజశేఖరం సంతాప సభలో వీరు పాల్గొని మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రస్తుత రాజకీయ నేతలకు రాజశేఖరం గురువు వంటి వారని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేసిన ఆయన రెండుసార్లు ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసారని అన్నారు. నాటి తరంలో ఎందరో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఎన్నో కుటుంబాలకు జీవనోపాధి కల్పించారని గుర్తు చేసారు. ఆయన భార్య జెట్పీటీసీ సభ్యురాలు ఇందుమతికి, ఆయన కుమారుడు ఎమ్మెల్సీ విక్రాంత్‌కు, కుమార్తె మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు కోలగట్ల వీరభద్రస్వామి, రఘురామకృష్ణరాజు, నర్తు రామారావు, కుంభా రవిబాబు, మాజీ ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, అలజంగి జోగారావు, శంబంగి చినప్పలనాయుడు, గొర్లె కిరణ్, కె.భాగ్యలక్ష్మి, బడ్డుకొండ అప్పలనాయుడు, రాజాం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తలే రాజేష్, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయ కర్త కరణం ధర్మశ్రీ, శోభా హైమావతితో పాటు రాజకీయ ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొని రాజశేఖరానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాలవలస రాజశేఖరంతో ఉన్న పరిచయాలను, అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ రాజశేఖరం ఆప్యాయత మరువలేనన్నారు. రాజకీయ గురువు ఇకలేరనే నిజాన్ని నమ్మలేకపోతున్నాన్నారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ తనను ఎంతో ఆప్యాయంగా పిలిచేవారన్నారు. తమ ప్రాంతంలో ఎందరికో రాజకీయ ఓనమాలు నేర్పారన్నారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ ఎందరో పేదలకు ఆశ్రయం కల్పించిన గొప్ప వ్యక్తి రాజశేఖరం అన్నారు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ అజాత శత్రువుగా ప్రజల గుండెల్లో కొలువుదీరిన రాజశేఖరం జీవితం ఎందరికో ఆదర్శమన్నారు. వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ సమన్వయకర్త తలే రాజేష్ మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయాలు చేసిన గొప్ప వ్యక్తి పాలవలస రాజశేఖరం అని కొనియాడారు.

ఒక శకం ముగిసింది

సీనియర్ రాజకీయ నాయకులు, గురు సమానులు పాలవలస రాజశేఖరం మరణంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒక రాజకీయ శకం ముగిసింది. 1970లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సీనియర్ నాయకుల్లో దాదాపు అందరూ రాజకీయాలకు దూరం కాగా ఈయన మాత్రం ఇంత వరకు ప్రత్యక్ష రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించారు. శ్రీకాకుళం జిల్లాలోని రాజకీయ ప్రముఖులు సర్దార్ గౌతు లచ్చన్న, బొడ్డేపల్లి రాజగోపాలరావు, గొర్లె శ్రీరాములనాయుడు వంటి ఉద్దండులతో రాజశేఖరం కలసి సమకాలీన రాజకీయం చేసారు.

– ధర్మాన ప్రసాదరావు, మాజీ మంత్రి

పార్టీ ఆవిర్భావం నుంచి..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి నమ్మిన బంటుగా పాలవలస రాజశేఖరం గుర్తింపు పొందారు. దివంగత నేత రాజశేఖరరెడ్డి ఇతన్ని పేరుపెట్టి పిలిచే సన్నిహిత్యాన్ని పొందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలో ఉంటూ ఈ ప్రాంతంలో పార్టీ బలోపేతం అయ్యేందుకు రాజశేఖరం ముఖ్య భూమిక పోషించారు.

– ధర్మాన కృష్ణదాస్, మాజీ ఉప ముఖ్యమంత్రి

నాన్నే రాజకీయ గురువు

చిన్నప్పటి నుంచి నాన్నను చూస్తూ పెరిగాను. ఎందరో పేదలకు ఆశ్రయం, ఉపాధి కల్పించారు. కష్టాల్లో ఉన్న ఎన్నో కుటుంబాల కన్నీళ్లు తుడిచారు. పేదల పెన్నిధిగా నిలిచి ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన నాన్నే నాకు తొలి రాజకీయ గురువు. నా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు వచ్చాయి. వాటిని అధిగమించేందుకు మా అమ్మ,నాన్న నాకు ఎంతో మనోధైర్యం చెప్పేవాళ్లు.

– రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే

ఆదర్శప్రాయుడు

పెద్ద రాజుగా ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన రాజకీయ కురువృద్ధులు, సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, రాజ్యసభ మాజీ సభ్యులు, శ్రీకాకుళం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, తూర్పుకాపు సామాజిక వర్గం ఆశాకిరణం, కింగ్ మేకర్‌గా పేరుగాంచిన పాలవలస రాజశేఖరం అలంకరించని పదవంటూ లేదు. కుటుంబ ఉన్నతితో పాటు పేదల పెన్నిధిగా నిలిచిన రాజశేఖరం మనందరికీ ఆదర్శప్రాయుడు.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్, విజయనగరం

నాన్న ఆశయాలను సాధిస్తా..

నాన్న చనిపోయినప్పటి నుంచి ఎందరో నాయకులు, ప్రజలు, ప్రముఖులు వచ్చి తమ సంతాపాన్ని తెలిపారు. వీరిలో చాలా మంది విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుండి వచ్చి నాన్న వారికి చేసిన సహాయాన్ని గుర్తు చేస్తుంటే ఆయన గొప్పతనం మాకు ఇంకా పూర్తి స్థాయిలో తెలియలేదే అనిపించింది. నాన్న ఆశయ సాధన కోసం కృషి చేస్తాను.

– పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ

కనుమరుగైన లక్ష్యం..


జొన్నవలసలో మూలకు చేరిన సామూహిక మరుగుదొడ్లు

- వృథాగా సామూహిక మరుగుదొడ్లు
- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా


బియ్యాలపేట గ్రామంలో వృథాగా పడిఉన్న మరుగుదొడ్లు

విజయనగరం రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారుల అనాలోచిత నిర్ణయాలతో లక్షలాది రూపాయలతో గ్రామాల్లో నిర్మించిన కమ్యూనిటీ మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. 2014 –19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రజాధనం వృథా చేసి అవసరం లేని చోట్ల సామూహిక మరుగుదొడ్లను నిర్మించింది. మండలంలోని జొన్నవలస, బియ్యాలపేట, పినవేమలి, దుప్పాడ, కోరుకొండ, చెల్లూరు, ద్వారపూడి, రాకోడుతో పాటు పలు గ్రామాల్లో ప్రజాధనంతో నిర్మించిన మరుగుదొడ్లు శతశాతం నిరుపయోగంగా పడి ఉన్నాయి. నిర్మించిన మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేక స్థానికులు ఉపయోగించకుండా అప్పట్లోనే విడిచిపెట్టేశారు. ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం లేకపోయినప్పటికీ కేవలం టీడీపీ నాయకులకు కాంట్రాక్ట్ పనులు అప్పగించడం కోసం మరుగుదొడ్లను నిర్మించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా మారింది. సామాజిక మరుగుదొడ్లతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్లను కూడా నిర్మించేలా నాటి టీడీపీ ప్రభుత్వం చొరవ తీసుకున్నప్పటికీ మరుగుదొడ్లవినియోగంపై అవగాహన కలిగించలేకపోయింది. చాలా గ్రామాల్లో ఇంటి ముందున్న మరుగుదొడ్లలో వంట సామగ్రి, వ్యవసాయ పనిముట్లు దాచిపెట్టుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

2019 తర్వాత వైఎస్సార్‌సీపీ హయాంలో బహిరంగ మలవిసర్జన చేయడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించి, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించేలా చర్యలు తీసుకుంది. అలాగే నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించారు. అయితే ఆరు నెలల కిందట మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం అమల్లోకి వచ్చినప్పటి నుంచి సామూహిక మరుగుదొడ్ల నిర్వహణను గాలికొదిలేశారు. చాలా చోట్ల తలుపులేవు. మరికొన్ని చోట్ల రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించలేదు. అధికారులు స్పందించి సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.